క్లుప్తంగా

మంత్రి రోజాకు కృతజ్ఞతలు



మంత్రి ఆర్‌కే రోజాను కలిసిన మేరీ

నింద్ర: రాష్ట్ర పర్యాటక, క్రీడలశాఖ మంత్రి ఆర్‌కే రోజా ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా పార్టీ విభాగంలో జిల్లా కార్యదర్శిగా చోటు దక్కించుకున్న నింద్రకు చెందిన మేరీ శనివారం మంత్రి రోజాను కలిశారు. ఈ సందర్భంగా మేరీ మంత్రి రోజాకు, రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆమెతో పాటు ఎంపీపీ దీప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, మండల కన్వీనర్ వేణురాజు, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, కోఆప్షన్ సభ్యులు అనిల్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు, లోకేష్‌పై ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు

పాలసముద్రం: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, లోకేష్, అచ్చెన్నాయుడుపై శనివారం పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తూ, రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడుపై చర్యలు తీసుకోవాలని కోరారు. పుంగనూరులో పోలీసులపై దాడులకు కారకులయ్యారని గుర్తుచేశారు. అంతేకాకుండా ఎవరిపై ఎక్కువ కేసులు ఉంటాయో వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామని లోకేష్ ప్రకటించడం శోచనీయమన్నారు. తోణం వీరిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గోపాల్, కుట్టి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉపకేంద్రంలో అక్రమ కట్టడాలపై సీరియస్

నారాయణవనం: మండల కేంద్రంలోని బీసీ కాలనీ ఆరోగ్య ఉప కేంద్ర భవన స్థలంలో స్థానిక వీఆర్‌ఏ అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి కట్టడాలను తొలగించాలని వైద్యాధికారిని డీఎం అండ్ హెచ్‌వో శ్రీహరి ఆదేశించారు. శనివారం ఉదయం శ్రీహరి అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఆరోగ్య ఉపకేంద్ర స్థలంలో నిర్మాణం చేపడుతుంటే ఫీల్డ్ స్టాఫ్ ఎందుకు పట్టించు కోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించి, ఆరోగ్య ఉపకేంద్రం, వెల్‌నెస్ భవణాల నిర్మాణాలకు ప్రతిపాదనలను పంపాలని మండల వైద్యాధికారి దర్శిత్ రాజ్, సీహెచ్‌వో శ్రీనివాసులును ఆదేశించారు. ఊరి మధ్యలో ఆస్పత్రి స్థలంలో భవనాలను కూల్చి, ఇంటి నిర్మాణం చేపడుతుంటే గుర్తించపోవడంపై క్షేత్ర స్థాయి సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే తహసీల్దార్, సీఐతో ఫోన్‌లో మాట్లాడారు. ఆక్రమణకు పాల్పడిన వీఆర్‌ఏపై చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మాజీ సర్పంచ్ కొండయ్య కుమారుడు పెరుమాళ్ తన వద్ద ఉన్న రికార్డులను వైద్యాధికారులకు చూపారు. 1971లో అప్పటి సర్పంచ్ కొండయ్య రూ.200 చెల్లించి దానా నరసింహులు నుంచి ఫ్యామిలీ ప్లానింగ్, హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణానికి రిజిస్ట్రేషన్ చేయించిన స్థలంలో 2019లో అప్పటి తహసీల్దార్, ప్రస్తుత బీఎస్ కండ్రిగ తహసీల్దార్ హనుమాన్ నాయక్ డీకేటీ ఇంటి స్థల పట్టాను వీఆర్‌ఏ తల్లిమీద ఎలా ఇచ్చారో రెవెన్యూ అధికారులకే తెలియాలి. అద్దె గదిలో నడుస్తున్న వెల్‌నెస్ సెంటర్‌కు భవనం నిర్మించడంలో శ్రద్ధ చూపని సంబంధిత శాఖల అధికారులు స్థలం కబ్జాకు గురవుతున్నా చోద్యం చూస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

నగరి.. సంక్షేమ సిరి

- సంక్షేమ పథకాల ద్వారా నగరి నియోజకవర్గంలో సుమారు రూ.2వేల కోట్లకుపైగా లబ్ధి
- మునుపెన్నడూ అందనంత సంక్షేమం
- సీఎం జగనన్న సహకారంతో మరింత అభివృద్ధి చేస్తాం : మంత్రి ఆర్‌కే రోజా



వైఎస్సార్ చేయూత చెక్కును అందుకుంటున్న మహిళలు (ఫైల్)

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాలుగున్నరేళ్ల సంక్షేమ పాలనలో నగరి నియోజకవర్గంలో సంక్షేమ నిధులు వరదలా పారాయి. నియోజకవర్గ ప్రజలకు బాసటగా నిలిచింది. ఆర్థికంగా బలోపేతం కావడానికి సహకరించింది ఈ ప్రభుత్వం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల్లో 32 సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గానికి రూ.2246.63 కోట్ల లబ్ధి చేకూరింది. ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా ప్రతి పైసా లబ్ధిదారుల ఖాతాలకే చేరింది. ప్రతి ఇంటా మహిళ ఖాతాల్లోకే సంక్షేమ లబ్ధి జమ కావడంతో దుర్వినియోగానికి, అవినీతికి తావులేకుండా పోయింది.



నవరత్నాల పథకాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మహిళలు

గతంలో ఐదేళ్లు అధికారంలో ఉన్న టీడీపీ పాలనలో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు 600 హామీలను తుంగలో తొక్కి ప్రజలను నిలువునా మోసం చేశారు. అభివృద్ధి మాట దేవుడెరుగు.. కనీసం ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయారు. అభివృద్ధి మాటల్లో తప్ప చేతల్లో కనిపించలేదు. నియోజకవర్గాల అభివృద్ధికి చిల్లి గవ్వ కూడా ఇవ్వని పరిస్థితి. దీంతో నగరి నియోజకవర్గంలో అభివృద్ధి పడకేయడంతో పాటు ప్రజలకు కూడా ఎలాంటి ఆర్థిక భరోసా లభించలేదు. ఆ పరిస్థితుల్లో కూడా నగరి నియోజకవర్గ ప్రజలకు మంత్రి రోజా అండగా నిలిచారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు వీలైనంత వరకు సాయం చేసి ఆదుకున్నారు. అయితే 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో ఒకవైపు అభివృద్ధి పనులు జరుగుతుండడంతో పాటు సంక్షేమం ద్వారా ప్రజలకు వేల కోట్ల మేర లబ్ధి చేకూరుతోంది. నాలుగేళ్లలో సంక్షేమ పథకాలు వెల్లువలా అందాయి.

నాలుగేళ్లలో సంక్షేమ పథకాలు, అందించిన నిధులు..

పథకం		రూ. (కోట్లలో)
పెన్షన్ కానుక	:	468.38
జగనన్న అమ్మ ఒడి	:	111.95
ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజ్	:	729.80
వైఎస్సార్ ఆసరా	:	134.20
వైఎస్సార్ చేయూత	:	118.18
అందరికీ ఇల్లు	:	139.45
ఉపాధి హామీ	:	210.67
వైఎస్‌ఆర్ రైతు భరోసా	:	84.33
పీఎం కిసాన్	:	50.37
సున్న వడ్డీ రుణాలు	:	45.16
జగనన్న విద్యాదీవెన	:	34.05
జగనన్న వసతి దీవెన	:	21.63
జగనన్న గోరుముద్ద	:	25.23
జగనన్న విద్యాకానుక	:	17.87
జగనన్న తోడు	:	14.00
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	:	9.78
ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ భీమా	:	9.50
వైఎస్సార్ సున్న వడ్డీ పంటరుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ		
వైఎస్సార్ ఉచిత పంటల భీమా,యంత్రసేవా పథకం	:	3.65
వైఎస్సార్ పశు భీమా, పసునష్టపరిహార పథకం	:	2.65
జగనన్న చేదోడు	:	2.65
వైఎస్సార్ నేతన్న నేస్తం, కాపునేస్తం, ఈబీసీ నేస్తం	:	9.37
కంటి వెలుగు	:	1.28
వైఎస్సార్ వాహన మిత్ర	:	1.73
అర్చకులకు, ఇమాంలు, ముజుందారిస్, పాస్టర్స్‌కు ఆర్థిక భరోసా	:	0.75
మొత్తం		2,246.63

జగనన్న సహకారంతో మరింత అభివృద్ధి..



నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా నేడు అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో చేపడుతున్నాం. ఇది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సహకారంతోనే సాధ్యమైంది. వేలకోట్ల సంక్షేమాన్ని అందించడంతో అభివృద్ధి పనులు పెద్దఎత్తున చేపట్టడం జరిగింది. విద్యాలయాలు, వైద్యశాలలు నాడు-నేడుతో కార్పొరేట్ స్థాయికి మార్చాం. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాలన ప్రజలకు చేరువైంది. పలు ఆర్బీకేలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలు నిర్మించాం. విత్తన పరిశోధన కేంద్రాలు, పశువైద్య పరిశోధన కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పలు ఆలయాలను నిర్మించడం, ఆధునీకరించడం జరిగింది. ఇలా మరెన్నో అభివృద్ధి నాలుగేళ్లలో జరిగింది. జగనన్న సహకారంతో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తా.

– ఆర్‌కే రోజా, రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి

28 నుంచి తెప్పోత్సవాలు

కార్వేటినగరం: ఈ నెల 28 నుంచి టీటీడీ ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామి తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ అధికారి మాట్లాడుతూ 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

కార్యక్రమాలు ఇలా..

28వ తేదీ సోమవారం 9 గంటలకు కోదండరామ స్వామివారికి స్నపన తిరుమంజనం, అదేరోజా సాయంత్రం 4 గంటలకు స్వామివారికి తిరువీధి ఉత్సవం ఉంటుందన్నారు. 29వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారికి వేదపండితులచే స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 గంటలకు వేణుగోపాలుని తిరువీధి ఉత్సవం జరుగుతుందన్నారు. 30వ తేదీ బుధవారం 9గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

యథావిధిగా దుకాణాలు నిర్వహించుకోవచ్చు

నగరి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా నగరి పట్టణంలో షాపులు మూసివేయాలంటూ పుకార్లు వస్తుండడంపై మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి స్పందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న విద్యాదీవెన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడానికి ఈ నెల 28న నగరి పట్టణానికి వస్తున్నారని ఈ పర్యటనలో రోజువారీ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు లేవని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని దుకాణదారులు, వ్యాపారులు దుకాణాలు మూసివేయాల్సిన అవసరం లేదన్నారు. వారి వారి విధులను వారు యథావిధిగా నిర్వహించుకోవచ్చన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కలశం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని సాయి బాలాజీ నగర్‌లో వెలసిన శ్రీషిరిడీ సాయినాథుని ఆలయంలో 16వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు చేపట్టారు. అనంతరం బాబాను పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే ఆలయంలో వేద పండితులు ప్రత్యేక హోమాలు చేపట్టారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె వైఎస్సార్‌సీపీ నాయకురాలు కృపాలక్ష్మి, అనిల్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలాజీ, ఎంపీపీ లత దంపతులు శాలువలు కప్పి ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదలను అందించారు. అదేవిధంగా మధ్యాహ్నం బెంగళూరుకు చెందిన మాధవరాజు సుమారు వెయ్యిమందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనుంజయవర్మ, మండల కన్వీనర్ శేఖర్ రాజు, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, కమిటీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కమిటీ సభ్యులు చిరంజీవిరెడ్డి, శేషాద్రి, పురుషోత్తంరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఫిట్ ఇండియా

తిరుపతి సిటీ: ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఎస్వీ వ్యవసాయ కళాశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కళాశాల అసోసియేట్ డీన్ జి.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. రోజుకు కనీసం 30 నిముషాలు వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం సిబ్బంది, విద్యార్థులు ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. ఉద్యోగులకు, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు రెడ్డిశేఖర్, సరళ, సంతోష్, వ్యాయామ విద్య విభాగం ప్రొఫెసర్ రవికాంత్ రెడ్డి, రాజేశ్వరి, చంద్రిక, రమణ పాల్గొన్నారు.

గజ వాహనంపై వీరభద్రుడు



నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్వామి, అమ్మవార్లు గజవాహనాన్ని అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య కైంకర్యాలను పూర్తి చేశారు. 10 గంటలకు భద్రకాళీ అమ్మవారు, వీరభద్ర స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం ఉత్సవర్లను సర్వాంగ సుందరంగా అలంకరించి గజవాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. భక్తుల అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు.

నేడు రథోత్సవం

ఆదివారం సాయంత్రం రథోత్సవం, రాత్రి 7.30 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు రూ. 500 చెల్లించి టికెట్ తీసుకోవాలని కోరారు.

జయహో భారత్..



జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఇస్రో ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

పాలసముద్రం: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో భారతదేశ ఖ్యాతిని ఇస్రో శాస్త్రవేత్తలు విశ్వవ్యాప్తం చేశారని ఉపాధ్యాయులు అన్నారు. శనివారం తిరుమలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి చంద్రయాన్-3 విజయవంతం సందర్భంగా జాతీయ పతాకంతో ర్యాలీ చేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయం ప్రతి భారతీయుడు గర్వించేలా చేసిందన్నారు. మనదేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో నివశిస్తున్న భారతీయులు ఈ విజయంతో సంబరాలు చేసుకుంటున్నారని చెప్పారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

భానోదయ పాఠశాలలో..

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని భానోదయ పాఠశాలలో చంద్రయాన్-3 విజయోత్సవాలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల సిబ్బంది జయహో భారత్ అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఇస్రో ఆకారంలో మానవహారం ఏర్పాటు చేశారు.

హక్కులను సద్వినియోగం చేసుకోండి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాఘువేంద్ర, హాజరైన అసంఘటిత కార్మికులు

- సీనియర్ సివిల్‌జడ్జి రాఘువేంద్ర

పుత్తూరు రూరల్: అసంఘటిత కార్మికులు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర సూచించారు. శనివారం స్థానిక సబ్ కోర్టు ఆవరణలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులు-వారి సేవలు అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ శాఖ ద్వారా ప్రవేశ పెట్టిన ఈ-శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలని కోరారు. పేపర్, పాలు వేసే యువకులు, ఇళ్లలో పనిచేసే మహిళలు, వ్యవసాయ కూలీలు, మేస్త్రీ పనులకు వెళ్లే వారు అసంఘటిత కార్మికులుగా పిలువ బడుతారని వివరించారు. ఇలాంటి వారు తమ పేర్లను కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకుని ఈ-శ్రమ్ కార్డులు పొందాలని సూచించారు. ఈ కార్డులు పొందిన వారు ఇందిరాగాంధీ నేషనల్ ఓల్డేజ్ పెన్షన్ స్కీమ్, జననీ సురక్ష యోజన, హ్యాండ్‌ల్యూమ్ వీవర్స్ కాంప్రెహెన్సివ్ వెల్ఫేర్ స్కీమ్, జన్‌శ్రీ బీమా వంటి పలు పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే కార్మికులు ప్రమాదాలకు గురైనప్పుడు పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకోవాలని సూచించారు. అప్పుడే తగిన నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. సదస్సులో పుత్తూరు కార్మిక శాఖాధికారి హేమచంద్ర ఆచారి, కార్మికులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ బాలాజీ కుటుంబానికి పరామర్శ



పార్వతి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పుత్తూరు మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ బాలాజీ తల్లి పార్వతి శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి చిన్నబ్బ నాయుడు కండ్రిగ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని బాలాజీకి భరోసా కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, నాయకులు రవీంద్ర, దిలీప్‌మొదలి, చిరంజీవియాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణపై అవగాహన



సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

కార్వేటినగరం: మామిడి సాగులో సస్యరక్షణ తప్పనిసరని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మామిడిలో తీసుకోవాల్సిన సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడికాయ కోత అనంతరం 15 నుంచి 20 రోజుల పాటు చెట్లకు విశ్రాంతి ఇవ్వాలన్నారు. అనంతరం తోటలో అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను తొలగించి సూర్యరశ్మి నలుమూలలా పడేవిధంగా చూడాలన్నారు. ఎండిన పూత కాడ ద్వారా ఎండు తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని తెలిపారు. తెగులు నివారణకు కాఫర్ ఆక్సీక్లోరైడ్ 10 గ్రాములు, ఒక్క లీటర్ నీటిలో కలిపి పూయాలని సూచించారు. అదేవిధంగా ఒక లీటర్ నీటికి కాఫర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలని సూచించారు. బెరడు తొలిచే పురుగుల నివారణకు పెట్రోల్, లేదా క్లోరిపైరిఫాస్‌లో దూదిని తడిపి ఉంచి రంధ్రాలను బంకమట్టితో కప్పివేయాలన్నారు. చెదలు నివారణకు 1 లీటర్ నీటికి 5 ఎంఎల్ క్లోరిపైరిసాస్ చెట్టు చుట్టు వేయాలని, తెలిపారు. అలాగే ఏపీఎంఐపీ పీడీ రమణారెడ్డి మాట్లాడుతూ చిన్న, సన్నకారు, రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 70 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలను అందజేస్తున్నట్లు చెప్పారు. చిత్తూరు డేటా సెంటర్ శాస్త్రవేత రెడ్డిరాజు మాట్లాడుతూ 10 ఏళ్లు, ఆ పైబడిన చెట్లకు 2 కిలోలు యూరియా 5 కిలోలు సనస్ పాస్పేట్, అదేవిధంగా 1.5 కిలోలు మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. యూరియా లేక పొటాష్ 50 శాతం ఆగస్టులో, మిగిలిన 50 శాతం ఎరువులను పిందె గోళికాయ సైజులో ఉన్నప్పుడు వేసుకోవాలన్నారు. కాయలు కోసిన 30 రోజుల లోపే నీరు పారించాలని తెలిపారు. హార్టికల్చర్ ఏడీ కోటేశ్వర రావు మాట్లాడుతూ మామిడి తోటలో జనుము, జీలుగ వేసి కలియదున్నాలన్నారు. అదేవిధంగా ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు, 1 లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయడం వల్ల ఎండు తెగుళ్ల నివారించవచ్చన్నారు.

వైభవంగా మహారథోత్సవం

- గరుడ వాహనంపై శ్రీకృష్ణుడి చిద్విలాసం
- దుర్యోధన వధతో పాండవుల విజయోత్సవం
- ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలతో పులకించిన పుత్తూరు



అశేష భక్త జన సందోహం మధ్య మహారథోత్సవం



గరుడ వాహనంపై శ్రీకృష్ణుడు

పుత్తూరు రూరల్: పుత్తూరు శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. చివరి అంకంలోని రెండవ రోజైన శనివారం విజయోత్సవాన్ని చాటుతూ పాండవులు నిర్వహించిన మహారథోత్సవం మహాభారతాన్ని కనులముందు ఆవిష్కరింపజేసింది. గజ, తురగ, పదాతులు వెంట నడువగా, మంగళ వాయిద్యాలు, బాణసంచా నడుమ, ముందు భాగాన శ్రీకృష్ణ రథం నడువగా వెనక మహారథోత్సవం వైభవంగా జరిగింది. 40 అడుగుల మహారథానికి ఇరువైపులా వందలాది మంది భక్తులు గోవింద.. గోవిందా.. అంటూ భక్తిపారవశ్యంతో లాగుతుంటే ఆలయ తిరువీధులు జనసంద్రమయ్యాయి. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో పుత్తూరు పట్టణం భక్తజనంతో కిక్కిరిసిపోయింది.

అంతకుముందు ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు, మోహన్ ఆధ్వర్యంలో స్థానిక మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగె ఆలయానికి చేరుకుంది. గెరిగ నీటితో స్వామి అమ్మవార్లకు అభిషేకం చేశారు. అనంతరం శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజు స్వాములను విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 11 గంటలకు గరుడ వాహనంపై శ్రీకృష్ణ భగవానుడు రాయబారం కోసం తరలివెళ్లే ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. శ్రీకృష్ణుడికి అడుగడుగునా మంగళ హారతులు ఇచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు భీముడు దుశ్శాసనున్ని వధించిన రక్తంతో ద్రౌపదీదేవి కురులను తడిపే ఘట్టం అందరినీ అలరించింది. అనంతరం దుర్యోధనున్ని సంహరించడం, విజయోత్సవంతో రథాన్ని అధిరోహించే ఘట్టాలు శ్రోతలను ఉద్రూతలూగించాయి. పుత్తూరు పట్టణ కమ్మ సంఘం ఆధ్వర్యంలో తిరువీధుల్లో రథంపై విహరించిన ద్రౌపదీదేవి సమేత పాండవ రాజులు ఆలయానికి చేరుకున్నారు. మహారథం ముందు శ్రీకృష్ణ రథంపై పాండవుల వేషధారణ, విజయోత్సవ విన్యాసాల అలరించాయి. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీ మోహన్, సభ్యులు ముకుందప్రకాష్, సెల్వరాజ పిళ్లై, మునిరాజ, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, ఆలయ నిర్వాహకులు సాల్వాకం ఏలుమలై మొదలి, పళనిమొదలి, గోపిమొదలి, పెరుమాళ్ మొదలి, కుప్పుస్వామిమొదలి పర్యవేక్షించారు.

నేడు అగ్నిగుండ ప్రవేశం..

ఉదయం 6 గంటలకు గెరిగె ఊరేగింపు, 9 గంటలకు కల్పవృక్ష వాహనం, 10 గంటలకు ఉత్సవం, సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



ఊరేగింపుగా వెలుతున్న పాండవ వేషధారులు